ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 11-2-2026 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది.
2. రాష్ట్ర ప్రభుత్వం 10 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఈ ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది.
3. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆత్మహత్య చేసుకున్న బీజేపీ అభ్యర్థి మహదేవప్ప కుటుంబాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ రోజు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా ఇచ్చారు.
4. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విషయంలో వివక్ష చూపిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆరోపించారు.

-------------------------------

**పోలింగ్**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈరోజు ప్రశాంతంగా పోలింగ్ కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. జగిత్యాల, మెదక్, నిర్మల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్ గిరి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, కామారెడ్డి, ఖమ్మం, మహబూబ్ నగర్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని పలు

మున్సిపాలిటీల్లో పోలింగ్ జరుగుతోంది. కడపటి సమాచారం అందేసరికి రాష్ట్రవ్యాప్తంగా 28.48 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు.

**జీఎస్**

------------------------------

**ఐఏఎస్ లు బదిలీ**

రాష్ట్ర ప్రభుత్వం పదిమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఈరోజు జీవో నెంబర్ 202 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం.. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా సవ్యసాచి ఘోష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గిరిజన సంక్షేమ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగానూ ఆయన కొనసాగనున్నారు. సెర్ప్ సీఈవోగా ఉన్న దివ్యకు పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయనీ దేవి బదిలీ అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు.  ఇక, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా శ్రీజన, మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా టి.వినయ్ కృష్ణ రెడ్డిని నియమించారు.

**జీఎస్**

------------------------------------

**కిషన్ రెడ్డి పరామర్శ**

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆత్మహత్య చేసుకున్న బిజెపి ఆరో వార్డు అభ్యర్థి మహదేవప్ప కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మహాదేవ కుటుంబ సభ్యులను పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణతో కలిసి కేంద్రమంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున మహదేవప్ప

కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఇలాంటి సంఘటన జరగడం ఎంతవరకు సమంజసం అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.

**బైట్ - కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి**

**పీటీసీ - మహబూబ్ నగర్**

------------------------------------

**తుమ్మల**

"వికసిత్ భారత్" అనే నినాదం ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ, కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయం జరుగుతోందని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదని, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని విమర్శించారు. 2018–19 నుంచి 2022–23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు 90.8 లక్షల కోట్ల రూపాయలు కాగా, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే 22.86 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని ఆయన అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి నాగేశ్వర్ రావు వ్యాఖ్యానించారు.

**డెస్క్**

------------------------------

**మక్తల్ లో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్**

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ తరఫున కౌన్సిలర్ గా పోటీలో ఉన్న ఎరుకలి మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

నిన్న రాత్రి మహదేవప్ప కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసిందని వెల్లడించారు.

**పీటీసీ – మహబూబ్ నగర్**

-----------------------------

**ప్రముఖుల ఓటు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా డెయిరీ పోలింగ్ కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిజామాబాద్ పట్టణంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, కరీంనగర్ 50వ డివిజన్ లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు అనంతరం బండి సంజయ్ మీడియా తో మాట్లాడుతూ...

**బైట్ - బండి సంజయ్**

**జీఎస్, పీటీసీ - కరీంనగర్**

-----------------------------

**కొత్త ఓటరు**

జగిత్యాల జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని కె. సంయుక్త తన మొదటి ఓటును వినియోగించుకోవడం ఆనందంగా ఉందని ఆకాశవాణికి తెలిపారు.

**బైట్ విద్యార్థిని**

**పీటీసీ - జగిత్యాల**

-------------------------------

**హరిత పోలింగ్ కేంద్రాలు**

వరంగల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ 80 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా కొనసాగుతోంది. వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేలా అధికారులు హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హరిత పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ...

**బైట్: కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**పీటీసీ - వరంగల్**

-------------------------------

**గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రం**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి, చౌటుప్పల్ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ హనుమంతా రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్లకు స్వాగతం పలకడంతో పాటు, దివ్యాంగులు, వృద్ధ ఓటర్లను సన్మానించారు.

**పీటీసీ - యాదాద్రి**

----------------------

**అంతర్జాతీయ బాలికా, మహిళా సైన్స్ దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ బాలికా, మహిళా సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాలలో మహిళల పాత్రను గుర్తిస్తూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 11న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి 2015లో

దీనిని ప్రకటించింది. పరిశోధన, ఆవిష్కరణలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, లింగ వివక్షను తొలగించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ దినోత్సవ నిర్వహణలో UNESCO, UN Women సంస్థలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. మహిళలు శాస్త్రీయ రంగంలో కూడా అద్భుతమైన ఆవిష్కరణలు చేయగలరని, వారికి అవసరమైన మద్దతు, అవకాశాలు కల్పించాలని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది.

**జీఎస్**

-----------------------------

**ఘంటసాల వర్ధంతి**

ఈరోజు ప్రముఖ తెలుగు చలనచిత్ర నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి. 1974 ఫిబ్రవరి 11న ఆయన కన్నుమూశారు. తన మధురమైన గాత్రంతో, భక్తిరస, భావగీతాలతో తెలుగువారి గుండెల్లో నిలిచిపోయిన ఘంటసాల, సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు.  మధుర కంఠశాల, గాన గంధర్వుడు ఆయనకున్న బిరుదులు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషా చిత్రాలకు కూడా ఆయన సంగీతం అందించారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

**జీఎస్**

------------------------